www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 29 జూన్ 2024

ముక్కంటి ఆలయ ఈవోగా ఎస్వీఎస్ఎన్ మూర్తి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తీశ్వరాలయ కార్యనిర్వహణాధికారిగా ఎస్వీఎస్ఎన్ మూర్తిని నియమిస్తూ శనివారం రాష్ట్ర దేవదాయశాఖ కమిషనరు ఎస్.సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్వీఎస్ఎన్ మూర్తి ప్రస్తుతం దేవదాయశాఖ తిరుపతి రీజనల్ జాయింట్ కమిషనరుగా పని చేస్తున్నారు. ఈయనకు ఆర్జేసీతో పాటు ముక్కంటి ఆలయ ఈవోగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ దేవదాయశాఖ కమిషనరు సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ముక్కంటి ఆలయ ఈవోగా పని చేస్తున్న ఎస్వీ నాగేశ్వరరావు ఆదివారం ఉద్యోగ విరమణ చేయనున్న సంగతి తెలిసిందే. ఆలయ బాధ్యతలను ఎస్వీఎస్ఎన్ మూర్తికి అప్పగించాలని ఎస్వీ నాగేశ్వరరావుకు దేవదాయశాఖ కమిషనరు సత్యనారాయణ ఆదేశించారు. కమిషనరు ఉత్తర్వులతో ముక్కంటి ఆలయ ఈవో ఎవరనే ఉత్కంఠకు తెరపడింది.

గుర్తింపు కోరని కమ్యూనిస్టు ఎవి వర్మ..!

నేడు 'ఎర్రజెండా నీడలో' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

పి.మధు, సిహెచ్ నర్సింగరావు హాజరు

'ఆయన ఆదర్శం...కుటుంబమే పార్టీ అనుకున్నారు.. పార్టీ కోసం అహర్నిశలు కష్టపడ్డారు.. గుర్తింపు కోసం ఏనాడూ తపించలేదు.. ఉత్తమ కమ్యూనిస్టుగా జీవించారు.. పార్టీ ఏ సంఘంలో పని చేయమని కోరినా తలూపుతూ ఇష్టంగా పనిచేయడం ఆయన నిజాయితీ.. పార్టీ ఏ పిలుపు ఇచ్చినా యువ కార్యకర్తలా ఎర్ర షర్టు ధరించి, ఎర్రని బ్యాగు భుజాన వేసుకుని పరుగులు తీస్తూ అరవైలో ఇరవైలా పోరాటాల్లో చురుగ్గా పాల్గొంటూ, చుట్టుపక్కల నడిచే క్యాడర్‌లో స్ఫూర్తినింపే మాస్టారు ఆయన. ఆయన గురించి మచ్చుకు ఓ ఉదాహరణ.

ఎర్రజెండా నీడలో పుస్తక రచన చేసిన ఎవి వర్మ

2006 వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి. ఆయన అధికారంలోకి రాకముందు ప్రతి పేదవానికి ఇంటి స్థలాలతో పాటు ఇల్లు నిర్మించి ఇస్తానని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లయ్యింది. ఎన్నికల హామీ నెరవేరలేదు. దీంతో సిపిఎం భూపోరాటానికి పిలుపునిచ్చింది. ఆ సమయంలో విపరీతమైన పేదలపై విపరీతమైన ధరల భారాలు, ఇంటి స్థలం కోసం పోరాటం. తిరుపతి ఆర్డీవో ఆఫీసు దగ్గర వామపక్షాల పిలుపుతో పెద్దఎత్తున పికెటింగ్ జరిగింది. పోరాటం తీవ్రస్థాయికి చేరింది. పెద్దఎత్తున పోలీసులు లాఠీఛార్జి ప్రయోగించారు. ఆర్డీవో ఆఫీసు గేటు వద్ద మహిళలు, యువకులు గేటు లోపలికి చొచ్చుకుని వెళ్లేందుకు ప్రయత్నించారు. ఆ సమయంలో డిఎస్‌పితో పాటు 25 మంది పోలీసులు లాఠీఛార్జి ప్రయోగించారు. మహిళలపై విచక్షణా రహితంగా లాఠీలను ఝులిపించారు. అక్కడే పోరాటంలో ఉన్న ఎవి వర్మ ఆడబిడ్డలపై లాఠీదెబ్బలను చూసి సహించలేకపోయాడు. మహిళలపై లాఠీదెబ్బ పడకుండా వారిని చుట్టుముట్టారు. మహిళలపై పడే ప్రతి లాఠీ వర్మపై పడింది. ఆ లాఠీదెబ్బలకు షర్టు చినిగిపోయింది. రక్తం చిందింది. దీంతో పోలీసులు 'పెద్దాయన'ను కొట్టలేక వెనుదిరిగారు. అక్కడున్న మహిళలందరూ వర్మకు దండం పెట్టడం కనిపించింది. ఇది ఆయన పోరాట పటిమ. అందుకే ఆయన ఆదర్శం.

నేడు 'ఎర్రజెండా నీడలో' పుస్తకావిష్కరణ

'ఎర్రజెండా నీడలో నా అనుభవాలు' పేరుతో ఎవి వర్మ స్వీయరచన చేశారు. ఈపుస్తకాన్ని ఆయన జన్మదినం పురస్కరించుకుని జూన్ 30న ఆదివారం ఆవిష్కరణ జరగనుంది. ఉదయం 10 గంటలకు తిరుపతి వేమన విజ్ఞాన కేంద్రంలో జరిగే ఈ కార్యక్రమానికి సిపిఎం మాజీ ఎంపి పెనుమల్లి మధు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు, ప్రముఖులు హాజరుకానున్నారు.

పేదల భూముల జోలికొస్తే సహించబోం

ఫారెస్టు అధికారులకు సిపిఎం హెచ్చరిక

ప్రజాశక్తి - వెంకటగిరి

పేదల భూముల జోలికొస్తే సహించబోమని ఫారెస్టు అధికారులను సిపిఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు హెచ్చరించారు. వెంకటగిరి మండలం పెట్లూరు రెవెన్యూ గ్రామానికి చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ తరగతులకు చెందిన నిరుపేదలు గత 30 సంవత్సరాలుగా సర్వే నంబర్ 12, 23లలో భూమిని సాగు చేసుకుంటున్నారు. అక్కడే గుడిసెలు వేసుకుని నివాసాలు ఉంటున్నారు. ఏరియాలో శనివారం జరిగిన జనరల్‌బాడీ సమావేశంలో పేదలను ఉద్దేశించి వి.నాగరాజు మాట్లాడుతూ ఫారెస్టు అధికారులకు సదరు భూమిపై ఎటువంటి హక్కు లేనప్పటికీ గ్రామస్తులపై చట్టవిరుద్ధంగా దౌర్జన్యానికి పూనుకుంటున్నారన్నారు. 2012 నుంచి ఫారెస్టు, రెవెన్యూ డిపార్టుమెంట్లు కలిసి జాయింట్ సర్వే నిర్వహించమని జిల్లా కలెక్టర్, గూడూరు సబ్ కలెక్టర్, వెంకటగిరి తహశీల్దార్ పలు దఫాలు ఫారెస్టు అధికారులకు రాతపూర్వకంగా తెలియజేసినప్పటికీ వారు సహకరించలేదన్నారు. జూన్ 24న పేదలపై కేసు నమోదు చేసినట్లు ఫారెస్టు రేంజి ఆఫీసర్ నోటీసులు పంపారన్నారు. ఈ భూములపై ఎటువంటి అధికారం లేకపోయినా గ్రామస్తులపై చట్ట విరుద్ధంగా దౌర్జన్యానికి పాల్పడుతున్న ఫారెస్టు వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏ అధికారంలో పేదలపై కేసులు నమోదు చేస్తారని ప్రశ్నించారు. పేదలు సాగు చేస్తున్న ఈ భూమిలోనే ప్రభుత్వం కేటాయించి ఉన్న ఇంటి స్థలాలు, రైతు భరోసా కేంద్రం, ఆస్పత్రి ఉన్నాయని తెలిపారు. ఇదే భూమిలో కొందరు రైతులకు పట్టాలు ఇచ్చారన్నారు. వాస్తవాలను మరుగునపరచి ప్రజాప్రతినిధులను, ప్రభుత్వ యంత్రాంగాన్ని పక్కదారి పట్టించేలా ఫారెస్టు అధికారులు వ్యవహరిస్తున్నారన్నారు. తిరుపతి జిల్లా రైతుసంఘం జిల్లా అధ్యక్షులు దాసరి జనార్ధన్ మాట్లాడుతూ పేదలు జానెడు స్థలంలో గుడిసె వేసుకుంటే ఫారెస్టువారు తరిమికొట్టేలా దౌర్జన్యం చేస్తూ రాజకీయ, ధనబలంతో అడ్డుకుంటున్నారన్నారు. పేదలపై దౌర్జన్యం చేస్తే ఊరుకునేది లేదన్నారు. పేదలకు అండగా సిపిఎం, రైతుసంఘం, వ్యవసాయకార్మిక సంఘం ఉంటాయన్నారు. సిపిఎం నాయకులు వడ్డిపల్లి చెంగయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు చేజర్ల రమణయ్య, దొరబాబు, వెంకట రమణయ్య, నాగమణి, రత్నమ్మ, సుబ్బమ్మ, రాజమ్మ, రమాదేవి పాల్గొన్నారు.

పేదలకు రేషన్ సక్రమంగా అందించాలి: ఆరణి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

రేషన్ డీలర్ల సమస్యల్ని పరిష్కరించేందుకు తన వంతు కషి చేస్తామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు. గత ఐదేళ్లలో రేషన్ డీలర్లు పలు సమస్యల్ని ఎదుర్కొన్నారని ఆయన తెలిపారు. తిరుమల తిరుపతి రేషన్ డీలర్ల అసోసియేషన్ ప్రతినిధులు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును సన్మానించిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ పేదలకు రేషన్ సక్రమంగా అందించాలన్నారు. రేషన్ డీలర్ల కమిషన్ పెంపు, డీలర్ లకే లాగిన్ అవకాశం కల్పించే అంశాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల దష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కషి చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్ల జిల్లా అధ్యక్షులు సోమశేఖర్, చంద్రశేఖర్ రెడ్డి, వెంకటేష్, గిరిబాబు, నాగరాజ శెట్టి, డిటీ సురేంద్ర, టిడిపి కార్పొరేటర్ ఆర్సీ మునికష్ణ పాల్గొన్నారు.

తిరుపతి లయన్స్ క్లబ్ అధ్యక్షులుగా ఎస్.కె ముబారక్ బాషా

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తిరుపతి లయన్స్ క్లబ్బు అధ్యక్షులుగా ముబారక్ బాషా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రస్తుత క్లబ్బు అధ్యక్షులు బి. మునికష్ణ నాయుడు తెలిపారు. స్థానిక బీమాస్ డీలక్స్ హోటల్ నందు కార్యవర్గ సమావేశం జరిగింది. అదేవిధంగా నూతన కార్యవర్గం కార్యదర్శిగా టీ. గోకుల్ కష్ణ, కోశాధికారిగా మేరీ, ఉపాధ్యక్షులుగా లెక్కల నాగరాజనాయుడు, మిట్టా ప్రదీప్ కుమార్, వినోద్ వెంకటాచలం, మెంబర్‌షిప్ కమిటీ చైర్మన్ మోహన్ సుందరం, ఎల్‌సిఐఎఫ్ కోఆర్డినేటర్ రాజేంద్రప్రసాద్, సర్వీస్ చైర్ పర్సన్ కె ఎస్ ప్రసాద్, మార్కెటింగ్ చైర్ పర్సన్ జి. సురేష్, క్లబ్ అడ్మినిస్ట్రేటర్ చిత్రా మోహన్ వ్యవహరిస్తారు. జులై 7న బీమాస్ డీలక్స్ హోటల్లో లయన్స్‌క్లబ్ మాజీ గవర్నర్ వి.విజయభాస్కర్‌రెడ్డి చేతుల మీదుగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

పలువురు ఉద్యోగులకు సన్మానం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుపతి ప్రజా రవాణా విభాగంలో వివిధ హోదాలలో పనిచేస్తూ ఈ నెల చివరలో ఉద్యోగ విరమణ చేస్తున్న నలుగురు ఉద్యోగులకు సన్మాన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రజా రవాణా అధికారి టి.చెంగల్ రెడ్డి విశిష్ట అతిథిగా విచ్చేసి కొనియాడారు. రమేష్, అసిస్టెంట్ మేనేజర్ ఫైనాన్స్, పీసీ బాబు సూపరింటెండెంట్ పర్సనల్, వీఆర్వో బి. కష్ణ రెడ్డి, టీటీఐ బి మణి ఉద్యోగ విరమణ సందర్భంగా పలువురు వారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజరు ఎం భాస్కర్ రెడ్డి, డిప్యూటీ సిఎంఈ జి. నరసింహులు పాల్గొన్నారు.

టీటీడీ ఆన్లైన్ అప్లికేషన్లకు ఆధార్ అనుసంధానం : ఈవో

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

శ్రీవారి భక్తులకు టీటీడీ అందిస్తున్న ఆన్లైన్ అప్లికేషన్ సేవలకు ఆధార్‌ను లింక్ చేయడం ద్వారా పారదర్శకతతో పాటు దళారీ వ్యవస్థను నియంత్రించేందుకు వీలవుతుందని టీటీడీ ఈవో జె.శ్యామలరావు చెప్పారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనం సమావేశ మందిరంలో శనివారం యుఐడిఎఐ (ఆధార్ సంస్థ) నుండి విచ్చేసిన అధికారులు, టిసిఎస్ జియో, టీటీడీ ఐటి విభాగంతో ఈవో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ ఇదివరకే టీటీడీ దర్శనం, వసతి, ఆర్జిత సేవలు, శ్రీవారి సేవ తదితర సేవలను ఆన్లైన్ ద్వారా భక్తులు బుక్ చేసుకునేందుకు వీలు కల్పిస్తోందన్నారు. అయితే ఈ అప్లికేషన్ల ద్వారా కూడా దళారుల బెడద తప్పడం లేదని, వాటిని నియంత్రించడానికి ఆధార్ లింక్ చేసేందుకు సాధ్యాసాధ్యాలు పరిశీలించి తగు చర్యలు తీసుకోవాల్సిందిగా ఐటి అధికారులను ఈవో ఆదేశించారు. ఇందుకు సంబంధించి యుఐడిఎఐ అధికారుల సహకారాన్ని తీసుకోవాలన్నారు. ఆధార్ ద్వారా యాత్రికుల గుర్తింపు, పరిశీలన, బయోమెట్రిక్ వెరిఫికేషన్ ఎలా చేయాలి, ఆధార్ డూప్లికేషన్ ఎలా నిరోధించాలి తదితర అంశాలపై ఆయన చర్చించారు. అంతకుముందు యుఐడిఎఐ అధికారులు ఆధార్ ను ఏ విధంగా అప్లికేషన్ లకు లింక్ చేయవచ్చు, తదితరాంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో యుఐడిఎఐ డిప్యూటీ డైరెక్టర్ సంగీత, అధికారులు శ్రీనివాస్, రాజశ్రీ గోపాలకష్ణ, అనుకూర చౌదరి, సంజీవ్ యాదవ్, టీటీడీ జేఈఓలు వీరబ్రహ్మం, గౌతమి, సివి అండ్ ఎస్ఓ నరసింహ కిషోర్, రవాణా విభాగం జనరల్ మేనేజర్ శేషారెడ్డి పాల్గొన్నారు.

'మఠాలను టిటిడి ప్రక్షాళన చేయాలి'

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

గోవింద నామ స్మరణతో మారుమోగే తిరుమలలో ఉన్న మఠాలను తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు ప్రక్షాళన చేయాలని ఆంధ్రప్రదేశ్ సాధు పరిషత్ డిమాండ్ చేస్తోందని శ్రీ ఆనందాశ్రమ పీఠాధిపతులు శ్రీనివాసానంద సరస్వతి స్వామీజీ డిమాండ్ చేశారు. శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన వివిధ పీఠాధిపతులతో కలిసి మాట్లాడారు. తిరుమలలోని మఠాల్లో మఠాధిపతులు మాత్రమే ఉండాలని, అలా కాకుండా మఠాల నిర్వాహకులు ముఠాలుగా ఏర్పడి తిరుమలకు వచ్చే భక్తులను నిలువునా దోచుకుంటున్నారని, పెళ్లిళ్ల పేరుతో తిరుమలలో భక్తుల నుండి స్వామివారికి చెందాల్సిన ధనాన్ని పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. ముఖ్యంగా మ్యారేజ్ కాంట్రాక్టర్స్ గా అవతారం ఎత్తిన రాఘవేంద్ర, రామారావు అనే వ్యక్తులు మఠాలను అడ్డుపెట్టుకొని అందులో పెళ్లిళ్లు చేయిస్తూ కోట్లు వెనకేసారని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తిరుమలతో ప్రక్షాళన చేస్తానని చెప్పి ఈవోను మార్చారని, ఒక్క ఈవో మార్పుతో ప్రక్షాళన సాధ్యపడదని, ఇంకా గత ప్రభుత్వ మత్తులో ఉన్న అధికారులను తొలగించి పూర్తిగా ప్రక్షాళన చేయాలని విజ్ఞప్తి చేశారు. తిరుమలలో నిబంధనలను అతిక్రమించి వాగు స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం చేసిన విశాఖ శారదా పీఠాన్ని తక్షణమే సీజ్ చేయాలని, భక్తుల భద్రత దష్ట్యా టిటిడి అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిద్దాం

ప్రజాశక్తి -రామచంద్రాపురం

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించి, పండించిన ఆహార ధాన్యాలను ఆహారంగా తీసుకుని ఆరోగ్యాన్ని సంరక్షించుకుందామని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. ప్రకతి వ్యవసాయం సాగు చేస్తున్న ఎస్సీ పేద రైతులకు తిరుపతి రూరల్ మండలం తనపల్లి సమీపంలోని రఘునాథ రిసార్ట్స్‌లో ఉన్న ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం ప్లాస్టిక్ పట్టలు, డ్రమ్ములు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకతి వ్యవసాయంను ప్రోత్సహించటమే లక్ష్యంగా పలు పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. రసాయనిక ఎరువుల వాడకం వలన ఆరోగ్యానికి హానికరం కావడంతో ప్రకతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. స్థానికంగా లభ్యమయ్యే ఆకులు, అలుములు పశువుల మూత్రం, పేడ, పుల్లటి మజ్జిగ, బెల్లం, మిరపకాయలు వంటి వాటితో ఘన, ద్రవ జీవామతాలను, కషాయాలను పెద్ద మొత్తంలో తయారు చేయడానికి డ్రమ్ములను ప్రభుత్వం అందిస్తున్నదని తెలిపారు. పండించే పంటలను నాణ్యతగా నూర్పిడి చేసుకోవడానికి ప్లాస్టిక్ పట్టలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలియజేశారు. ప్రకతి వ్యవసాయం ద్వారా పండించే కూరగాయలకు, ధాన్యానికి మంచి డిమాండ్ ఉన్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రకతి వ్యవసాయ జిల్లా పథక మేనేజర్ షణ్ముగం, వ్యవసాయ అధికారిణి మమత, అదనపు ప్రాజెక్టు మేనేజర్ పట్టాభి రెడ్డి, ప్రకతి వ్యవసాయం సిబ్బంది స్వామి కొండయ్య, శ్రీదేవి పాల్గొన్నారు.

జీరియాట్రిక్ మెడికల్ క్యాంపు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆయుష్ కమిషనర్ రాజేంద్రప్రసాద్ ఆదేశాల మేరకు మంగళం ఆయుష్మాన్ ఆరోగ్యం మందిర్ వైద్యాధికారిని ప్రసన్నలక్ష్మి, మంగళం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని జయంతి సంయుక్త ఆధ్వర్యంలో తిరుపతి కరకంబాడి మార్గంలోని తెలుగు తల్లి వద్ధాశ్రమంలో శనివారం జీరియాట్రిక్ మెడికల్ క్యాంపును నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ మెడికల్ క్యాంపు ద్వారా ఆయుష్మాన్ ఆరోగ్యం మందిర్ పరిధిలోని వద్ధాశ్రమాలలో ఉన్న వయోవద్ధులకు బిపి, మధుమేహం, కీళ్ల నొప్పులు, ఆరోగ్య పరీక్షలను నిర్వహించడం జరుగుతుందని డాక్టర్ ప్రసన్న లక్ష్మీ తెలిపారు. జూలై 15వ తేదీ వరకు ఈ క్యాంపులు కొనసాగుతాయని తెలిపారు. ఈ మెడికల్ క్యాంపు కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి రాజేశ్వరి, కాంపౌండర్ తారకనాథ్ తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం మరవలేనిది

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

సంజయ్ గాంధీ కాలనీలోని నగర పాలక ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం ప్రధానోపాధ్యాయులు కె.ధనంజయులు నాయుడు ఆధ్వర్యంలో 1వ తరగతి నుండి 5వతరగతి విద్యార్థులకు ఉచితంగా రాత పుస్తకాలు, పలకలు పంపిణీ చేశారు. రూ.35వేల విలువగల పెన్సిల్స్, రబ్బర్, బలపాలు మొదలగు విద్యా సామగ్రిని చంద్రగిరి మండలం, నడింపల్లి గ్రామస్తులు తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు దొండపాటి మునిశంకర్ నాయుడు, వారి కుమారుడు నిహాల్క కలిసి అందించారు. దాత మాట్లాడుతూ విద్యార్థులకు అందించిన విద్యా సామగ్రిని సక్రమంగా వినియోగించుకుని ఉన్నత స్థాయికి విద్యార్థులు చేరుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు కె బాలాజి , కే భాస్కర్ నాయక్ దాతలను అభినందించి సత్కరించారు. టిడిపి నగర మహిళా అధ్యక్షురాలు శాంతమ్మ, తొమ్మిదో వార్డు మహిళా అధ్యక్షురాలు స్రవంతి, గోపాల్, మునస్వామి, ముని యాదవ్ పాల్గొన్నారు

శ్రీవారి లడ్డు నాణ్యత పెంచడానికి చర్యలు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

శ్రీవారి లడ్డు ప్రసాదాలు మరింత రుచిగా, నాణ్యత పెంచేందుకు చర్యలు తీసుకోవాలని టీటీడీ ఈవో జె. శ్యామలరావు అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో శనివారం ఈవో కార్యాలయంలో టీటీడీ అధికారులు, డెయిరీ నిపుణులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ మరింత నాణ్యమైన నెయ్యిని ఎలా కొనుగోలు చేయాలి, కొనుగోలు చేసిన నెయ్యిని ప్రస్తుతం పరీక్షిస్తున్న విధంగా కాకుండా మరింత అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఎలా పరీక్షించాలి తదితర అంశాలపై, అందుకు తీసుకోవలసిన మార్పులను తెలియజేయాలని ఆయన నిపుణులను కోరారు. తరువాత ప్రముఖ డెయిరీ నిపుణులు విజయభాస్కర్ రెడ్డి, సురేంద్రనాథ్ లడ్డు నాణ్యత పెంచేందుకు ఎస్ఎస్ఐ నిబంధనల ప్రకారం నాణ్యమైన నెయ్యిని ఎలా తయారు చేస్తున్నారు, ఫుడ్ సేఫ్టీ అథారిటీ ఆఫ్ ఇండియా అగ్ మార్క్, నిబంధనల ప్రకారం నెయ్యి నాణ్యత ఎలా ఉండాలనే విషయమై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వారు వివరించారు. ఈ సమావేశంలో జెఈఓ గౌతమి, ఎస్వి గోశాల డైరెక్టర్ హరినాథ్ రెడ్డి, కొనుగోలు జిఎం మురళీకష్ణ, ఎస్ఇ-2 జగదీశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

విలువిద్యలో స్ప్రింగ్ డేల్ విద్యార్థిని ఘనత

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

తిరుపతి-కరకంబాడి మార్గం చెన్నాయిగుంట గ్రామ సమీపంలో ఉన్న స్ప్రింగ్ డేల్ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న ప్రియా ప్రణవి ఈ నెల విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్ 10 ఇండియన్ రౌండ్ బాలుర కేటగిరి ఆర్చరీ పోటీలో మొదటి స్థానం సంపాదించుకుని జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల నిర్వాహకులు కేవస్ వాసు సంతోషం వ్యక్తం చేశారు. తమ విద్యార్థి జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపిక అవడం పాఠశాలకు గర్వకారణం అన్నారు. విద్యార్థులకు క్రీడల పట్ల ఆసక్తి కలిగేలా పాఠశాలలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిని పాఠశాల ప్రిన్సిపాల్ కే.ఆర్. అనురాధ గోపాల్, హెడ్ మిస్ట్రెస్ వి.ప్రమీల కష్ణన్, ఏఓ కే. చంద్రశేఖర్, పిఆర్ఓ టి.సాంబ శివ రెడ్డి పాల్గొన్నారు.

బీసీ హాస్టల్లో సమస్యలు పరిష్కరించాలి : జెవివి

ప్రజాశక్తి -రేణిగుంట

రేణిగుంట బిసి హాస్టల్ సమస్యలపై రేణిగుంట మండల విద్యాశాఖాధికారి రంగనాదయ్య , మండల అభివద్ధి అధికారి విష్ణు చిరంజీవిలకు జనవిజ్ఞాన వేదిక నాయకులు కుప్పస్వామి, వెంకట రమణలు వినతి పత్రం అందజేసారు. పరిష్కారానికి కషి చేస్తామని ఎంఈఓ రంగనాదయ్య తెలిపారు. రేణిగుంట బిసి హాస్టల్లో లెట్రిన్ సంప్ నిండి పోయి చాలా కాలం అయ్యింది. అందు వల్ల పిల్లలు మూత్ర విసర్జనకు బయటకు వెళ్ళవలసి వస్తోందని చెప్పడంతో ప్రత్యేక చొరవ చూపినందుకు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. రేణిగుంట హాస్టల్‌కు పర్మినెంట్ వార్డెన్‌ను నియమించాలని, ట్యూటర్లను నియమించి విద్యాభివృద్ధికి తోడ్పడాలని, కిటికీలు, తలుపులు, లైట్లు, ఫ్యాన్లు స్విచ్చులు మరమ్మతు చేయాలని కోరారు. ఫిల్టర్ వాటర్ రిపేర్ చేయాలన్నారు. పంచాయతీ నీటికొళాయి కనెక్షన్ ఇప్పించాలన్నారు. పాములు తరచూ హాస్టల్లోనికి వస్తున్నాయని, వీధిలైట్లు వేయించాలన్నారు. సిబ్బందిని నియమించి విద్యార్థుల చదువులకు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

కాల్వలపై ఆక్రమణలు తొలగించాలి : కమిషనర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తిరుపతి నగరంలోని కాలువలపై ఆక్రమణలను తొలగించి పూడిక తీసే పనులు వేగవంతం చేయాలని తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అదితిసింగ్ ఐఏఎస్ ఆదేశాలు జారీ చేసారు. తిరుపతి నగరంలోని వివి మహల్ రోడ్డు, భవానీ నగర్, రైల్వే కాలనీ, సాయిరామ్ వీధి ప్రాంతాల్లో శనివారం విస్తతంగా కమిషనర్ పర్యటించి శానిటేషన్, ఇంజనీరింగ్ అధికారులకు తగు సూచనలు జారీ చేశారు. వివి మహల్ రోడ్డుకు ఇరువైపుల ఉన్న ప్రధాన కాలువలపై ఆక్రమణలు తొలగించి, అటు తరువాత పూర్తి స్థాయిలో సిల్ట్ తొలగించి, ఎలాంటి ఆంటకాలు రాకుండా కాలువల్లోని మురికి నీరు ప్రవహించేలా తగు చర్యలు చేపట్టాలన్నారు. దేవేంద్ర థియేటర్ పక్కన వెలుతున్న ప్రధాన కాలువలో కేబుల్ వైర్లు, ఇతర పైప్ లైన్లు మురుగు నీటి ప్రవాహానికి అడ్డుగా వుండడం గమనించి, వాటినన్నింటిని క్రమబద్ధికరించి మురుగునీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా పనులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, మునిసిపల్ ఇంజనీర్ వెంకట్రామిరెడ్డి, డిఈ శ్రావణి, శానిటరి సూపర్ వైజర్ చెంచెయ్య పాల్గొన్నారు.

ఖాతాదారులకు డివిడెంట్లు అందిస్తాం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తిరుపతి కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకులో ఉండే ఖాతాదారులు అందరికీ డివిడెంట్లు త్వరలో అందిస్తామని ఆ బ్యాంకు వైస్ చైర్మన్ వాసు యాదవ్ ప్రకటించారు. శనివారం తిరుపతి కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ ఆవరణంలో ఖాతాదారులతో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. చైర్మన్ రామారావు ఊర్లో లేకపోవడంతో వైస్ చైర్మన్ వాసు యాదవ్ ఇన్చార్జి చైర్మన్గా ఈ సమావేశానికి వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆయన ఖాతాదారులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం ఇస్తూ టౌన్ బ్యాంక్ పరిధిలో సుమారు 40 కోట్ల రూపాయలు మొండి బకాయిలు వసూలు చేయడంతో డివిడెంట్లు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. తమ పాలకవర్గం బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి మొండిబకాయలపైనే పనిచేయడం జరిగిందన్నారు. టౌన్ బ్యాంక్ చైర్మన్ వైస్ చైర్మన్ కార్యాలయాన్ని మద్యం బార్‌గా మార్చారని కొన్ని పత్రికల్లో వచ్చిన వార్తలు అవాస్తవమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో టౌన్ బ్యాంక్ డైరెక్టర్లు మహమ్మద్ ఖాసిం, అత్తూరు సురేష్ రెడ్డి ,వెంకటేష్ రాయల్, అనిల్ కుమార్ రాయల్, మబ్బు నాదం రెడ్డి, బ్రహ్మానందం రెడ్డి, పి నాగిరెడ్డి, చంద్రయ్య పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

సీఐటీయూ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు అంగన్‌వాడీ వర్కర్స్ వినతి

సీఐటీయూ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : గత ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో 42 రోజులు చేసిన సమ్మె పోరాట ఫలితంగా జీవో విడుదల చేసిందని, ఇప్పుడు కొత్త ప్రభుత్వం ఆ జీవో అమలు విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్స్ సీఐటీయూ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌కు శనివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు ఆర్ వెంకటేష్, అంగన్‌వాడీ నాయకురాలు మునికుమారి మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్స్‌ను ప్రభుత్వ ఉద్యోగు లుగా గుర్తించాలని, మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా గుర్తించాలని, సుప్రీంకోర్టు ఇచ్చిన గ్రాడ్యుటీ అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సంక్షేమ పథకాలు వర్తింప చేయాలని, డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. స్పందించిన నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి సమస్యను సానుకూలంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మునికుమారి, విజయకుమారి, రాధా, ధనమ్మ, అంబిక, లలితమ్మ, లక్ష్మి, కృష్ణవేణి, జయంతి, అరుణ, హైమావతి పాల్గొన్నారు.

గోడ కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలి

పోలీసులకు పంచాయతీ సెక్రటరీ వినతి

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: ఏర్పేడు మండలం గుడిమల్లం రెవెన్యూ పరిధిలోని గుండ్ల కండ్రిగ పంచాయతీలో సర్వే నెంబర్ 70లో ఉన్న స్థలంలో గత ప్రభుత్వంలో ప్రహరీని నిర్మించారు. అయితే ఆ ప్రహరీని కొంతమంది గుర్తు తెలియని దుండగులు ఈనెల 16వ తేదీ కూల్చివేశారని, వారిపై చట్టమైన చర్యలు తీసుకోవాలని ఏర్పేడు మండలం గుండ్ల కండ్రిగ పంచాయతీ కార్యదర్శి రాజేష్ పోలీసులకు, మండల అధికారులను కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం సాయంత్రం ఏర్పేడు సీఐ శ్రీరామ శ్రీనివాసులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదులో గుండ్ల కండ్రిక పంచాయతీకి చెందిన వైసీపీ సర్పంచ్ జయముని చెప్పిన విధంగా అదే గ్రామానికి చెందిన శ్రీధర్, విజయ భాస్కర్, చంద్రశేఖర్ల పేర్లను ఫిర్యాదులో పేర్కొన్నారని తెలిపారు. అయితే దీనిపై శనివారం గ్రామంలో విచారణ చేపట్టామని తెలిపారు. ఆ విచారణలో టిడిపి నేతలైన శ్రీధర్, విజయ భాస్కర్, చంద్రశేఖర్ లకు ప్రభుత్వ స్థలంలో ఉన్న గోడ కూల్చడంపై ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు. గుర్తు తెలియని దుండగులు ప్రభుత్వ స్థలంలో గోడను కూల్చినట్లు నిర్ధారణకు వచ్చినట్లు చెప్పారు. దుండగలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన సీఐ శ్రీరామ శ్రీనివాసులుని కోరారు.

బీటెక్ విద్యార్థుల కమ్యూనిటీ సర్వీస్

ప్రజాశక్తి -తిరుపతి డెస్క్: ఏర్పేడు మండలం పెద్ద అంజిమేడు గ్రామంలోని పాతమిట్ట మండల పరిషత్ పాఠశాలలోని విద్యార్థులకు శ్రీ వెంకటేశ్వర పెరుమాళ్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీకి చెందిన బీటెక్ విద్యార్థులు కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్ట్‌లో భాగంగా పరిశుభ్రత, పౌష్టికాహారం విషయాలపై అవగాహన కల్పించి సందేహాలను పరిష్కరించారు. బాలికలకు గుడు టచ్, ,బ్యాడ్ టచ్ తదితర అంశాల గురించి వివరించి పాఠశాల పరిసరాలను విద్యార్థులతో కలిసి శుభ్రపరిచారు.

విద్యార్థుల రక్తదానం

ప్రజాశక్తి - క్యాంపస్: చంద్రగిరి నియోజకవర్గంలో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసిన చెవిరెడ్డి మోహిత్ రెడ్డి జన్మదినం సందర్భంగా తుమ్మలగుంట నివాసం వద్ద వైసిపి విద్యార్థి విభాగం ఎస్‌వియూ అధ్యక్షుడు మన్నం ప్రేమకుమార్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, స్విమ్స్ బ్లడ్ బ్యాంకులో రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు ముని, నరేష్, చరణ్, సాయి, రవి, పవన్, కళ్యాణ్ , లిఖిత్, బోస్ ప్రణీదీప్ పాల్గొన్నారు.

బయో మెడికల్‌పై అతిథి ఉపన్యాసం

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో 'రీసెంట్ అడ్వాన్సస్ ఇన్ బయోమెడికల్ రీసెర్చ్ అండ్ ఆపర్చునిటీస్ ఇన్ అకాడమిక్ అండ్ కెరియర్ డెవలప్‌మెంట్' అనే అంశంపై ఆహ్వానిత ఉపన్యాసకులు ఉపన్యసించారు. స్పీకర్ డాక్టర్ కామేశ్వర రావు బద్రి ప్రొఫెసర్ ఇన్ మోర్ హౌస్ స్కూల్ ఆఫ్ మెడిసిన్, రోజర్ విలియమ్స్ యూనివర్సిటీ, అట్లాంటా, యూఎస్ఏ నుండి విచ్చేసి ప్రత్యేకంగా విద్యార్థినులకు మాస్టర్స్, డాక్టర్ ప్రోగ్రామ్స్ యూఎస్ఏలో చేయడానికి వున్న అవకాశాలను వివరించారు. రీసెర్చ్ ల్యాబ్స్ లో పాటించాల్సిన ఎథిక్స్ గురించి, బయో మెడిసిన్ లో జరుగుతున్న అడ్వాన్స్ రీసెర్చ్ స్టడీస్ గురించి విద్యార్థులకు, ఫ్యాకల్టీకి వివరించారు. ఈ కార్యక్రమంలో రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఆర్ ఉష, కార్యక్రమ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ జాన్ సుష్మా, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ మెంబర్స్, ఇందిరా, మాధవి, శిరీష, సుజాత, రమేష్ బాబు, ఫ్యాకల్టీ, స్టూడెంట్స్ పాల్గొన్నారు.

జిల్లా టాస్క్ ఫోర్స్ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - సత్యవేడు: తిరుపతి జిల్లా ఆరోగ్య సంబంధిత టాస్క్ ఫోర్స్ నలుగురితో కూడిన బృందం సత్యవేడు మండలంలో శివారు గ్రామ పంచాయతీ ఆరూరు సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసింది. ఈ తనిఖీలో భాగంగా ఆరూరు సచివాలయ పరిధిలోని కిషోర్ బాలికలు, గర్భిణులు, బాలింతలను రికార్డు లోని నమోదు ఆధారంగా పర్య వేక్షించారు. వారికి రక్తహీనత, పోషకాహార లోపం వల్ల కలిగే నష్టాలు, ఆరోగ్య సంరక్ష ణకు సంబంధించిన మెలకువల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో 39 మంది లబ్ధిదారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా టాస్క్ ఫోర్స్ అధ్యక్షులు డాక్టర్ పి శ్రీనివాసరావు, పి నాగేశ్వర్ కుమార్, డిపిఓ ప్రకాష్, డిపిహెచ్ఎన్ఓ బేబీ రాణి, ఏ పాండూరు ప్రభుత్వ వైద్యశాలకు సంబంధించి డాక్టర్ అనిత, పిహెచ్ఎన్ రాణి, ఎం పిహెచ్ఓ, ఏఎన్ఎం నర్సులు, ఆశాలు పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ చేయనున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి - సత్యవేడు: జూలై 1వ తేదీన స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు సత్యవేడు టిడిపి మండల అధ్యక్షులు ప్రవీణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు టిడిపి ప్రభుత్వం గతంలో ఇచ్చిన 3వేల రూపాయలను నాలుగువేల రూపాయలు పెంచిందన్నారు. దీంతోపాటు ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి వెయ్యి రూపాయలు చొప్పున కలుపుకొని జూలై 1వ తేదీన లబ్ధిదారులకు ఏడువేల రూపాయలు అందించనున్నట్లు ఆయన వివరించారు. ఇందులో భాగంగా సత్యవేడు మండలం మదనంబేడు గ్రామంలో పెంచిన పింఛను సొమ్ము పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం శ్రీకారం చుడతారని ఆయన తెలిపారు.

ఇంటి వద్దకే పింఛన్లు: కమిషనర్

శ్రీకాళహస్తి: ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్లు వచ్చే జూలై 1వ తేదీ సోమవారం లబ్ధిదారులకు సచివాలయ ఉద్యోగులు ఇంటి వద్దే పంపిణీ చేస్తారని పురపాలక సంఘం కమిషనరు ముప్పాళ్ల రమేష్ బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ భరోసా పింఛను కోసం లబ్ధిదారులు ఎవరూ సచివాలయాల వద్దకు రావాల్సిన అవసరం లేదన్నారు. పింఛను ఎలా పంపిణీ చేయాలనే అంశంపై సచివాలయ ఉద్యోగులకు సూచనలు ఇచ్చామని ఆయన పేర్కొన్నారు. సచివాలయ సిబ్బంది ఇంటింటికి వచ్చి నెలవారీ పింఛనుతో పాటూ పెంచిన మొత్తం రూ. 7వేలు చెల్లిస్తారన్నారు. ఈ కార్యక్రమాన్ని నోడల్ అధికారులు పర్యవేక్షిస్తారన్నారు. లబ్ధిదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

'సుధాకర్ సేవలు ఆదర్శనీయం'

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: తొట్టంబేడు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్ సేవలు ఆదర్శమని శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి సతీమణి బొజ్జల రిషితారెడ్డి కొనియాడారు. బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్ ఉద్యోగ విరమణ శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బొజ్జల రిషితారెడ్డి హాజరయ్యారు. సుధాకర్ దంపతులను సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో బొజ్జల రిషితారెడ్డి మాట్లాడుతూ బాలికల జూనియర్ కళాశాల అభివృద్ధికి ప్రిన్సిపాల్ సుధాకర్ ఎంతో కృషి చేశారన్నారు. ఆయన కృషి ఫలితంగానే నేడు తొట్టంబేడు బాలికల జూనియర్ కళాశాల నేడు ఇంత స్థాయికి అభివృద్ధి చెందిందని ఆమె కొనియాడారు. సుధాకర్ దంపతుల శేష జీవితం ఆనందంగా సాగాలని ఆమె ఆకాంక్షించారు. అంతకుముందు శుకబ్రహ్మాశ్రమ పీఠాధిపతి విద్యాస్వరూపానందగిరి స్వామి సుధాకర్ దంపతులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు విజయకుమార్, రావిళ్ల మునిరాజానాయుడు, కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

సర్పంచ్ సొంత నిధులతో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండలం తలారి వెట్టు పంచాయతీలోని తలారి వెట్టు పంచాయతీ సర్పంచ్ వెట్టి ప్రసాద్ తన సొంత ఖర్చులతో ఎన్టీఆర్ నగర్‌లో, పంచాయతీలోని ఎస్‌టి కాలనీలలో డ్రైనేజీలను శుభ్రం చేయించారు. పంచాయతీలోని వీధి స్తంభాల లైట్లను ఆధునీకరించారు. పంచాయతీలోని ప్రతి చిన్న సమస్యను పరిష్కరిస్తూ పంచాయతీ ప్రజల మన్ననలు పొందుతున్నారు. ఈ అభివృద్ధి పనుల్లో భాగంగా పంచాయతీ సర్పంచ్ ప్రసాద్ దగ్గరుండి అన్ని పనులు పర్యవేక్షిస్తున్నారు.

గంగ కాలువ భద్రత గాలికి!

● పారని నీరు ● తొలగని ముళ్ల పొదలు ● కానరాని అధికారులు

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: సత్యవేడు నియోజకవర్గ పరిసర ప్రాంతాల్లో ఉన్న తెలుగు గంగ కాలువ భద్రత గాలి కొదిలేయడం తో పూర్తిగా దుస్థితికి చేరింది. గత ఐదేళ్లుగా ఈ కాలువపై ప్రత్యేక పర్యవేక్షణ లేకపోవడంతో ఈ సమస్య ఏర్పడింది. ప్రధానంగా మన రాష్ట్రానికి సాగునీరు పక్క రాష్ట్రం తమిళనాడుకు తాగునీరు అందించే గంగ కాలువలు అధ్వానంగా మారాయి. ఈ కాలువలకు ఇరువైపులా ముళ్ల చెట్లు ఏపుగా పెరిగి పోయాయి. కాలువ అక్కడక్కడా చిట్టడవిని తలపిస్తోంది. బుచ్చి నాయుడు కండ్రిక మండలం నుంచి సత్యవేడు సరిహద్దు వరకు కాలువలు పూర్తిగా అధ్వానంగా మారి దుస్థితికి చేరుకున్నాయి. అక్కడక్కడా బ్రాంచి కెనాల్ పనులు కూడా ఆగి పోయాయి. రాచపాలెం నుంచి సత్యవేడు సరిహద్దు వరకు కాలువ వెంబడి వేసిన రోడ్లు కూడా దుస్థితికి చేరాయి. కాలువల్లో పూడిక మట్టి ఎక్కువగా పేరుకు పోవడంతో నీటి ప్రవాహానికి ఇబ్బందులు తప్పడం లేదు. ఐదేళ్లుగా అధికారులు కాలువల పర్యవేక్షణ, నిర్వహణను పూర్తిగా విస్మరించారు. దీంతో సమీప రైతులకు సాగునీటి కష్టాలు తప్పడం లేదు.

చంద్రబాబు హయాంలోనే మెరుగు..

గంగ కాలువలను గతంలో చంద్రబాబు హయాంలో ఏడాదికి ఒక ఒకసారి శుభ్రం చేస్తూ వచ్చేవారు. ఉపాధి హామీ కింద కూలీలతో కాలువకు ఇరువైపులా ఉన్న ముళ్ల చెట్లను తొలగించేవారు. ప్రస్తుతం పరిస్థితి అధ్వానంగా మారిపోయింది. ఇప్పటికిప్పుడు తమిళనాడుకు తాగు నీరును అందించాలన్నా కాలువలు అధ్వానంగా ఉండటం వల్ల నీటి ప్రవాహం పెద్దగా ఉండదు. అందువల్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలుగంగ కాలువలను శుభ్రం చేయడంతో పాటు సమీప రైతులకు సాగునీరు అందించడానికి ఏర్పడ్డ అడ్డంకులను తొల గిం చాలని సత్యవేడు నియోజకవర్గ ప్రజలు వేడుకుంటున్నారు. ప్రస్తుతం తెలుగు గంగ అధికారుల పనితీరు జీతాలు తీసు కోవడానికి మాత్రమే పరిమితమైంది. కాలు వల పర్యవేక్షణ, సమీపంలో నిల్వ ఉంచిన మట్టి నిల్వల భద్రత పూర్తిగా గాలి కొది లేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. ఇదిలా ఉండగా బుచ్చి నాయుడు కండ్రిగ మండలంలోని ప్రభుత్వ కార్యా లయాలకు వెళ్లే దారిలో తెలుగు గంగ పాత భవనాలు ఉండడం అందరికీ విదితమే. ఆ భవనాలకు ఇరువైపులా సాంఘిక సంక్షేమ బాలురు వసతిగృహం, బీసీ సంక్షేమ బాలుర వసతి గృహం వున్నాయి. శిథిలావస్థలో ఉండడంతో ఆ భవనాల నుండి విచ్చలవిడిగా పాములు స్వైర విహారం చేయడం ఆందోళనకు గురి చేస్తోంది. దీంతో ఆ మార్గంలో ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే అధికారులు భయాందోళన చెందుతున్నారు. శ్రీ సిటీ, అపాచీ కంపెనీలకు అదే దారిన కాలినడకన వెళ్లే కార్మికులు రాత్రి సమయంలో వేసే షిఫ్టుల డ్యూటీలకు వెళ్లేవారు సైతం విష సర్పాల బెడదతో భయాందోళనకు గురవుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వం పురాతన భవనాలను పరిశీలించి వాటిని జెసిపితో తీసివేసి శుభ్రపరచాలని స్థానికులు కోరుతున్నారు. ఆ భవనాలు చాలా కాలంగా నిరుపయోగంగా వున్నందువల్ల కూలే స్థితిలో వున్నాయని తగిన చర్యలు తీసుకోవాలని, సర్పాల బెడదను నివారించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

లోక్ అదాలత్ ద్వారా కేసులకు సత్వర పరిష్కారం

- ప్రిన్సిపల్ సివిల్ జడ్జి సులోచనారాణి

మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సివిల్ జడ్జి సులోచనారాణి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : చట్ట ప్రకారం రాజీ చేసుకోగలిగిన కేసు లన్నింటికీ మెగా లోక్ అదాలత్ ద్వారా సత్వర పరిష్కారం లభిస్తుం దని ప్రిన్సిపల్ సివిల్‌జడ్జి సులోచనా రాణి పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని కోర్టు భవన సముదా య ప్రాంగణంలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం మెగా లోక్ అదాలత్ గూడూరు రెండో పట్టణ పరిధిలోని కోర్టు భవన సముదాయ ప్రాంగణంలో శనివారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ లోక్ అదాలత్‌లో పలు కేసులను న్యాయమూర్తులు పరిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జడ్జి సులోచనా రాణి మాట్లాడుతూ.. మెగా లోక్ అదాలత్ ద్వారా అనేక రకాల కేసులు పరిష్కరిస్తున్నామన్నారు. తద్వారా కక్షిదారులకు సత్వర న్యాయం అందుతోందని తెలిపారు. ఇది గుర్తించి లోక్ అదాలత్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, వీలైనంత వరకు కక్షి దారులు కేసులు పరిష్కరించుకోవాలని ఆమె సూచించారు. ఇంకా మరి కొందరు మాట్లాడారు. ఈ లోక్ అదాలత్‌లో న్యాయమూర్తి లోకనాథం, న్యాయవాదులు, బార్ అసోసియేషన్ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్ : కేసులు పరిష్కా రానికి లోక్ అదాల త్ చక్కటి మార్గ్గమని పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర పేర్కొ న్నారు. స్థానిక కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ సమావే శం శనివారం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కక్షి దారులు పంతాలకు, పట్టింపులకు పోకుండా వాటిని వీడి కేసులు రాజీ చేసుకోవాలని అదే ఉత్తమ మార్గమని సూచించారు. లోక్ అదా లత్ వల్ల కాలం, ధనం ఆదా అవు తుందన్నారు. గ్రామీణ ప్రాంత వ్యవసాయ కూలీ లకు వున్న హక్కులు తెలుసు కోవాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉపాధి హామీని సద్విని యోగం చేసుకోవాలని సూచించారు. అసంఘటిత కార్మికులు చట్టా లను తెలుసుకో వాలన్నారు. ఈ సమా వే శంలో ప్రిన్సిప ల్ జూనియర్ సివిల్ జడ్జి జానకి, పుత్తూరు బార్ అసోసియేషన్ ప్రసిడెంట్ ఏ పురుషోత్తం, నాయకులు రాజారెడ్డి, ఎం సంజీవి, శేషాచలం, న్యాయ వాదులు, కక్షి దారులు పాల్గొన్నారు.

పుత్తూరులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర

వెంకటగిరిలో

వెంకటగిరి: స్థానిక జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన మెగా లోక్ అదాలత్‌లో 223 కేసులు పరిష్కరించినట్లు వెంకటగిరి జూనియర్ సివిల్ జడ్జి ఓ అనూష తెలిపారు. మెగా లోక్ అదాలత్‌లో వారు మాట్లాడుతూ పలువురు కక్షిదారులు కేసుల సత్వర పరిష్కారం కోసం మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకున్నారన్నారు. వాటిలో 19 సివిల్ , 188 క్రిమినల్ కేసులతో పాటు బ్యూటీపార్లర్, బీఎల్ఎస్‌బిఎస్ కేసులు పది, బ్యాంక్ కేసులు ఆరు మొత్తం 223 కేసులు పరిష్కరించామని తెలిపారు. ఈ కార్యక్ర మంలో సీనియర్ న్యాయవాదులు, బ్యూటీ పార్లర్ బీరం మురళికృష్ణ , బాబ్జి , గాంధీ , రాజేష్ పాల్గొన్నారు.

పింఛన్లు సక్రమంగా అందించాలి

అధికారులకు కమిషనర్ ఆదేశం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పింఛన్లు లబ్ధిదారులకు సక్రమంగా అందేలా చూడా లని పుత్తూరు పురపాలక సంఘ కమిషనర్ కేఎల్ఎం రెడ్డి అధికారులను ఆదేశించారు. సచివాలయ సిబ్బంది, మున్సిపల్ సిబ్బందితో పింఛన్ల పంపిణీపై శనివారం అవగాహన సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లా డుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పింఛను పథకం రూ.3వేలు నుండి 4వేల రూపాయలకు పెంచిన పింఛను మొత్తం ఏప్రిల్, మే, జూన్ నెల అరియర్స్ మొత్తం కలిపి ఏడువేల రూపాయలు పింఛనుదారులకు సచి వాలయం సిబ్బంది ద్వారా పంపిణీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. పుత్తూరు సచివాలయం, పురపాలక సిబ్బందితో పింఛన్ల పంపిణీ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగా హనా సదస్సు ఏర్పాటు చేశారు.

మాట్లాడుతున్న కమిషనర్ కెఎల్ఎం రెడ్డి

విద్యార్థులు సాఫ్ట్ స్కిల్స్ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి - క్యాంపస్: విద్యార్థులు చదువుకునే స్టేజ్ స్థాయిలో సాంకేతిక నైపుణ్యాలు సాఫ్ట్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్ పై అవగాహన కలిగి వివిధ రకాల నైపుణ్యాలను పెంపొందించుకోవాలని స్కిల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ ఆచార్య ఏం. విద్యావతి పేర్కొన్నారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, కంప్యూటర్ సైన్స్ విభాగంలో, ఎంప్లాయబిలిటీ స్కిల్స్ ప్రోగ్రామ్ ను విజయవంతంగా ముగించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డైరెక్టర్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ ఆచార్య ఎం. విద్యావతి హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి హాజరు అయిన విద్యార్థులను ప్రశంసిస్తూ వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఎం.ఉషారాణి పాల్గొన్నారు.

భారత్ క్రికెట్ జట్టుకు 'ఆదిశంకర' విద్యార్థుల సంఘీభావం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : భారతదేశ క్రికెట్ జట్టు సౌత్ ఆఫ్రికా క్రికెట్ టీంతో ఫైనల్ మ్యాచ్ సందర్భంగా వారికి స్థానిక ఆదిశంకర పాఠశాల విద్యార్థులు శనివారం శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాల విద్యార్థులు ఆల్ ద బెస్ట్ ఆకారంలో ఏర్పడి భారత్ క్రికెట్ టీం టి20 ప్రపంచ కప్ ను గెలవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ రూపవతి మాట్లాడుతూ టి20 ప్రపంచ కప్ ఫైనల్లో సౌత్ ఆఫ్రికాపై భారతదేశం గెలిచి భారతదేశం త్రివర్ణ పతాకం మరోసారి రెపరెపలాడాలని ఆకాంక్షించారు. విద్యార్థులందరూ భారత్ క్రికెట్ టీంకు ఆల్ ద బెస్ట్ తెలిపారు. కెప్టెన్ రోహిత్ శర్మ విరాట్ కోహ్లీ భారత ఆటగాళ్లందరూ బాగా ఆడి భారతదేశానికి టి20 ప్రపంచ కప్ తీసుకురావాలని 140 కోట్ల భారతీయుల కలను నెరవేర్చాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మల్లికార్జున, ప్రశాంత్ , పాఠశాల పీఈటి మనోహర్ విద్యార్థులు పాల్గొన్నారు.

భారత్ క్రికెట్ టీం విజయం సాధించాలని కోరుతూ సంఘీభావం తెలుపుతున్న విద్యార్థులు

నవోదయలో 'విశ్వం' విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి - క్యాంపస్ : జాతీయ స్థాయిలో 2024-2025 విద్యా సంవత్సరానికి జరిగిన జవహర్ నవోదయ విద్యాలయ పరీక్ష ఫలితాల్లో 11వ తరగతిలో ప్రవేశానికి నిర్వహించిన ఫలితాల్లో విశ్వం విద్యార్థులు ఎం యశ్వంత్, ఆర్ మహిత, ఏ యుగంధర్, పి సాత్విక, పి లక్ష్మీనారాయణ సీట్లు సాధించి విజయభేరి మోగించారు. వీరితో పాటు 6వ, 9వ తరగతి ఫలితాల్లో పి గంగా జైదీప్ రెడ్డి, వి లాస్య, ఎన్ లిఖిత, పి ఉదయశ్రీ, జి లక్ష్మి శ్రీ, ఎన్ కేతన్ భాస్కర్, ఎన్ జ్యోత్స్న, ఎ గౌతం కుమార్, హేమంత్, కేథన్, ఎం హాసినిలతో పాటు మొత్తం 48 మంది విశ్వం విద్యార్థులు సీట్లు సాధించారని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు, విశ్వం విద్యా సంస్థల అధినేత డాక్టర్ యన్ విశ్వనాథ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన

విద్యార్థులను విశ్వం విద్యా సంస్థల అధినేత డాక్టరు యన్ విశ్వనాథ రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ యన్ విశ్వ చందన్ రెడ్డి, కరస్పాండెంట్ యన్ తులసీ విశ్వనాథ్‌లు విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో విశ్వనాథ రెడ్డి మాట్లాడుతూ గత 34 సంవత్సరాలుగా జాతీయ స్థాయిలో జరిగే సైనిక్, నవోదయ, మిలిటరీ స్కూల్స్ వంటి పోటీ పరీక్షలకు తమ సంస్థలో శిక్షణ ఇస్తూ జాతీయ స్థాయిలో ఉత్తమ ఫలితాలతో పాటు అత్యుత్తమ మార్కులు , ర్యాంకులను విశ్వం విద్యార్థులు సాధిస్తున్నట్లు తెలిపారు.

డయేరియాపై అవగాహన

డయేరియాపై అవగాహన కల్పిస్తున్న

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పిల్లలకు సీజనల్ వ్యాధులైన డయేరియా, దోమల ద్వారా వ్యాపించే విషజ్వరాలపై వైద్యాధికారి డాక్టర్ దివాకర్ శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ చేతుల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహ న కల్పించారు. ప్రతి ఒక్కరూ బహిరంగ మల విసర్జన చేయకుండా మరుగు దొడ్లను ఉపయోగించాలని, మలవిసర్జన చేసిన తరువాత, భోజనానికి ముందు ఖచ్చితంగా చేతులు శుభ్రం చేసుకోవాలన్నారు. వేడి ఆహారం, తాజా ఆహారం, క్లోరినేషన్ చేసిన నీరు తీసుకోవడం ద్వారా డయేరియాను నివారించవచ్చని తెలిపారు. డ్రైడే పాటించడం ద్వారా పరిసరాలను శుభ్రంగా ఉంచుకొని ఇంటి చుట్టూ గుంతలు, పొదలు లేకుండా చూసుకోవడం, ఇంటి లోపల, ఇంటి చుట్టూ నీరు నిల్వ లేకుండా చూసుకోవడం ద్వారా దోమలను లార్వాలను నాశనం చేసి దోమలు వ్యాపించకుండా నివారించవచ్చని దోమల ద్వారా వ్యాపించే మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, మెదడు వ్యాపు వ్యాధి, బోధకాలు జబ్బులను నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రవీంద్రనాథ్, మునిసుబ్రహ్మణ్యం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణయ్య, వైద్యాధికారి డాక్టర్ దివాకర్, ఆరోగ్య అధికారి డిఎన్ వెంకటేష్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: రూరల్ మండలంలోని గోపాలకృష్ణాపురం ఎంపిపి పాఠశాలలో ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తిరుపతి వాసన్ ఐ కేర్ ఆస్పత్రి, నారాయణాద్రి హాస్పిటల్, ఆపిల్ ఇంటరనేషనల్ డెంటల్ కేర్ హాస్పిటల్ సహకారంతో ఆదివారం 9గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డిఈఓ శేఖర్, డివైఈఓ ప్రభాకర్ రాజు, ఎంఈఓ బాలసుబ్రహ్మణ్యంలు శనివారం తెలిపారు. ఈ వైద్య శిబిరంను ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించి గుండె, కంటి, పంటి సమస్యలు పరీక్షించి వైద్య సేవలు అందిస్తారని, ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నారని తెలిపారు. ఈ వైద్య శిబిరానికి వచ్చే వారు ఆధార్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డులు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు కోనేటి రవి రాజు, అధ్యక్షులు బాబు, ఉపాధ్యక్షులు రమేష్ నాయుడు, కార్యదర్శి రామ్మోహన్ వర్మ, కోశాధికారి లోకనాథనాయుడు, ఉప కార్యదర్శి రామేష్ రాజులు పాల్గొంటారని తెలిపారు.

ప్లాస్టిక్ వ్యర్థాలపై స్వచ్ఛంద సంస్థల పోరాటం

ప్రజాశక్తి - క్యాంపస్ : విచక్షణారహితంగా విసిరివేసే ప్లాస్టిక్ వ్యర్థాలు పర్యావరణానికి , మానవాళికి చేసే పెనుముప్పును గ్రహించి అలాంటి వ్యర్థాలను తొలగించడానికి తిరుమల , తిరుపతి నగరాల్లో ఒంటరి పోరాటం చేస్తున్న యువకుడు శివాజీ పోరాట కృషికి రోటరీ క్లబ్ తిరుపతి, లెట్ అస్ హెల్ప్ అస్ అనే సంస్థలోని యువతియువకులు, యోగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుమన అండగా నిలిచారు. స్థానిక ఎస్వియూ ఇంజనీరింగ్ కాలేజ్ మెన్స్ హాస్టల్ పరిసరాల్లో విచ్చలవిడిగా పడి ఉన్న సుమారు 18 గోనెసంచుల ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరివేసి ఆయా హాస్టల్లో నివసిస్తున్న విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలిచారు. అంతేకాక వారికి ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని , వాడిన ప్లాస్టిక్‌ను ఒకచోట సేకరించి రీసైకిలింగ్ కోసం పంపాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ తిరుపతి కార్యదర్శి సోమ్ రవికుమార్ పూర్వ అధ్యక్షులు వేమూరి జయరాం ప్రసాద్ , కోరా వెంకటాచలపతి పాల్గొన్నారు. లెటర్స్ హెల్పర్స్ అనే సంస్థ తరపున నాయకురాలు నేహా సురేష్ లెక్కల నేతృత్వంలో ఇంజనీర్లు, యువ ఇంజనీర్లు హసిత, త్రిష, రాహుల్, దీపిక, సీడ్ డిజైన్స్ స్టూడియో యాజమాన్యం, ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తిరుపతిలోని ప్రతి వ్యక్తి ప్లాస్టిక్ అనర్థం పట్ల అవగాహన కలిగించే విధంగా ఒక సంవత్సరం పాటు ఈ కార్యక్రమం నిర్వహించేలా ప్రణాళికలు రచించుకొని ముందుకెళతామని ఈ సందర్భంగా రోటేరియన్ వేమూరి జయరాం ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యూనిఫాం పంపిణీ చేస్తున్న రిషితారెడ్డి

ప్రభుత్వ బడుల్లోనే మెరుగైన విద్య

-బొజ్జల రిషితారెడ్డి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ప్రభుత్వ బడుల్లోనే మెరుగైన విద్య లభిస్తుందని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి సతీమణి బొజ్జల రిషితారెడ్డి పేర్కొన్నారు. తొట్టంబేడు మండలం గుండేలిగుంట ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు 'స్టూడెంట్స్ కిట్స్' పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి బొజ్జల రిషితారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ బడులను బలోపేతం చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక కృషి చేస్తున్నారన్నారు. ఇందులో భాగంగానే ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయడానికి మెగా డీయస్సీపై మొదటి సంతకం చేశారని, ప్రభుత్వం ఏర్పడిన వెంటనే పాఠశాలల్లో విద్యా కిట్లు పంపిణీ చేయాలని ఆదేశించారని, విద్యార్థులకు ఏ సమస్య రాకుండా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. రాష్ట్ర విద్యా మంత్రి నారా లోకేష్ సరికొత్త ప్రణాళికలతో ప్రభుత్వ బడులను బలోపేతం చేస్తారని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు అంకిత భావంతో బోధించి ప్రభుత్వ బడుల్లో మెరుగైన ఫలితాలు సాధించడానికి కృషి చేయాలని ఆమె కోరారు. విద్యార్థులు ప్రభుత్వం అందచేస్తున్న కిట్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు బాగా చదివి పాఠశాల, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తొట్టంబేడు మండల టీడీపీ అధ్యక్షులు గాలి మురళినాయుడు, రావిళ్ల మునిరాజా నాయుడు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం

ప్రియమైన మిత్రులారా!

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి

(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ